క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఏకలవ్య బొమ్మ సెంటరు, ఒలివలకొండ చర్చి ప్రాంతాలతో పాటు రాజశ్రీ వక్కపొడి ఫ్యాక్టరీ నుంచి కిసాన్‌నగర్ వరకు రహదారికి ఇరువైపుల, డొంక రోడ్డు ఏరియా, రైల్వేస్టేషన్ నుంచి కృష్ణా టాకీసు సెంటరు వరకు రోడ్డుకు దక్షిణం వైపు, హౌసింగ్ బోర్డు కాలనీలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చుండూరు(వేమూరు): చుండూరు మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల నిమిత్తం వేటపాలెం, తోటపాలెం, గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు లంక అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా చౌటూరి

బాపట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. ఎస్టీ సెల్ సెక్రటరీగా చౌటూరి రమేష్‌ను నియమించారు. స్టేట్ సేవాదళ్‌కు సెక్రటరీగా గోలి గంగాధర్‌రావు, జాయింట్ సెక్రటరీగా వి.రెడ్డియ్య, లీగల్ సెల్ సెక్రటరీగా గుంటూరు కృష్ణ, జాయింట్ సెక్రటరీగా కె.రవిని నియమించారు.

ఘనంగా భావనారుషి కల్యాణ మహోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు భోగేశ్వరపేటలోని సీతారామ మందిరంలో కొలువైన భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్లకు రథసప్తమి సందర్భంగా శుక్రవారం కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం

రేపల్లె రూరల్: మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి తిరునాళ్ల ఏర్పాట్లపై ఈ నెల 17వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించబడునని ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ చొప్ప రవీంధర్‌బాబు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో అధికారులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా పాండురంగ కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రథ సప్తమి, దశమ పునః ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు సామూహిక పూజలు జరిగాయి. స్వామి వార్లను పురవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామి వార్లకు దివ్య నీరాజనాలు పలికారు. కార్యక్రమాలను ధర్మకర్తల మండలి నిర్వాహకులు పర్యవేక్షించారు.

రేపు గంగానమ్మతల్లి బలిపీఠ శిఖర ప్రతిష్ట

కుచ్చెళ్లపాడు(వేమూరు): వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో 18వ తేదీ ఆదివారం రోహిణి నక్షత్ర యుక్త మేషలగ్న పుష్కరాంశమున ఉదయం 10.49 గంటలకు గంగానమ్మ తల్లి సింహ వాహన బలిపీఠ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేది నుంచి 18 వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

జాతీయస్థాయి తైక్వాండోలో నిజాపట్నం విద్యార్థికి రజతం



నిజాంపట్నం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నిజాంపట్నం విద్యార్థి రజిత పతకం సాధించినట్లు రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి మాస్టర్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నిజాంపట్నంలో పతకం సాధించిన కార్తికేయకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో నిజాంపట్నం బోధిధర్మ అకాడమీ విదార్థి కార్తికేయ సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొని, ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. కార్తికేయను పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష .. ప్రజలకు శ్రీరామరక్ష

ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



చినపరిమిలో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో రోగులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారిణి



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంక్షేమానికై ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2లో భాగంగా మండలంలోని చాత్రగడ్డ పంచాయతీలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమానికై వారు నివాసం ఉండే ప్రాంతాలలోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు వైద్యసేవలను వారి దరికి చేర్చుతున్నారన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది 270 మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినపరిమిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి సచివాలయం ఆవరణలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో చుండూరు, వేటపాలెం, యడ్లపల్లి పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఆప్తమాలజిస్ట్ వైద్య సేవలు అందించారు. 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఎంపీటీసీ సభ్యురాలు అవుతు శివపార్వతి, ఉప సర్పంచ్ అవుతు సాయిబాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బూత్ కమిటీ కన్వీనర్లే కీలకం



కూచిపూడి పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ కన్వీనర్లతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): వైఎస్సార్‌సీపీ గెలుపుకు బూత్ కమిటీ కన్వీనర్లు కీలక బాధ్యత వహించాలని నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ కన్వీనర్లు గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి వివరించాలని సూచించారు. వేమూరు నియోజకవర్గంలోని 233 మంది బూత్ కమిటీ కన్వీనర్లు ఉన్నారు. ప్రతి బూత్ కమిటీ కన్వీనర్ బాధ్యతగా పని చేస్తే వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. బూత్ కమిటీ కన్వీనర్లు ఓటర్ల లిస్టులో కులాలుగా విభజించాలని ఆయన సూచించారు. చనిపోయిన వారి ఓట్లు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఓట్లు ఉంటే గుర్తించి వాటిని తొలగించేందుకు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఓట్లు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. బూత్ కన్వీనర్లు ఓటర్ల లిస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుల పని తీరును తెలుగు దేశం పార్టీల నాయకులు గుర్తించి ప్రజల వద్దకు వెళుతున్నారన్నారు. గతంలో తెలుగు దేశం పార్టీ ప్రజల వద్దకు వెళ్లిన దాఖలాలు కనిపించలేదన్నారు. బూత్ కమిటీ కన్వీనర్లు పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ అనపురెడ్డి వీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు యలవర్తి సురేష్, బొల్లిముంత ఏడుకొండలు, అనపు రెడ్డి రఘురామిరెడ్డి, కుర్రా శ్రీనివాసరరావు, మండల బూత్ కన్వీనర్లు దాది సుబ్బారావు, బొట్టు మోషే, ఎంపీపీలు జాలాది రూబేను, దావూరి, వెంకట లలితాకుమారి, తిరువీధులు ఉదయ భాస్కరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నకేశవాలయంలో రథ సప్తమి వేడుకలు

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సూర్య నారాయణ సుప్రభాత సేవ అనంతరం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం స్వామి వారి ప్రతిమకు పంచామృతాభిషేకం జరిపి విశేష అర్చన నిర్వహించారు. అనంతరం భక్తుల చేత సూర్య నమస్కారాలు చేయించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి రథ సప్తమి పర్వదినం విశిష్టతను భక్తులకు వివరించారు. ఆదిత్య హృదయం పారాయణ చేస్తూ ప్రదక్షిణలు చేశారు. గో క్షీర పాయసాన్నాన్ని నివేదించి భక్తులకు వినియోగించారు.

ఈవీఎంలపై అవగాహన



కర్లపాలెం: ఎన్నికలలో ఓట్లు వేసేందుకు వినియోగించే ఈవీఎంలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నిర్మలానందబాబా చెప్పారు. శుక్రవారం కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈవీఎం బ్యాలెట్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల గుర్తులు ఉంటాయని చెప్పారు. ఓటరు ఓటు వేసిన అనంతరం వీవీప్యాట్‌లో ఓటు వేసిన సింబల్ తాలూకు గుర్తు 7 సెకన్ల వరకు కనిపిస్తుందని చెప్పారు. ఈవీఎంలపై ఎలాంటి అపోహలు వద్దని ఓటర్లకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీస్ విజయభాస్కర్‌రెడ్డి, వేణుమాధవ్, వీఆర్వో పి.రమేష్ రెడ్డి, బీఎల్‌వోలు శ్రీనివాసరావు, సాయికృష్ణ, మౌనిక తదితరులున్నారు.

రబీ పంటల పరిశీలన



చుండూరు(వేమూరు): రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము పంటలకు తెగుళ్ల వ్యాప్తి చెందకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి కె.విజయనిర్మల అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని మున్నంగివారి పాలెం రైతు భరోసా కేంద్రం పరిధిలోని పొలాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయాధికారులు ఈ నెల 19వ తేదీ నాటికి పంట నమోదు, ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో ఇప్పటి వరకు 98 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ లక్ష్మి, డాట్ సెంటర్ సైంటిస్ట్ సురేఖా దేవి, మండల వ్యవసాయాధికారి ఆదాం బాబు, ఎంపీపీ జాలాది రూబేను రైతులు పాల్గొన్నారు.

రహదారి నియమ నిబంధనలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి

రేపల్లె రూరల్: రహదారి నియమ నిబంధనలపై వాహన చోదకులకు కనీస అవగాహన ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి చెప్పారు. 35వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రామశాస్త్రి కల్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రహదారి నియమ నిబంధనలపై అవగాహన లేకపోవటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలపై దూరప్రాంతాలకు వెళ్లే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణం చేసే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. అతివేగం ప్రమాదకరమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో లైసెన్స్‌లను తమతోనే ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ స్టేట్ చాంపియన్స్ బేతపూడి క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న కోట వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు

బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో బాపట్ల మండలం, బేతపూడి గ్రామం వాలీబాల్ టీం రాష్ట్రస్థాయిలో చాంపియన్స్‌గా నిలిచింది. ఈ నెల 9 నుంచి 13 వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బేతపూడి జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కప్పు, ప్రశంసా పత్రాలతోపాటు రూ.5 లక్షల ప్రైజ్ మనీని సొంతం చేసుకున్నారు. శుక్రవారం వెదుళ్ళపల్లి చైతన్య భవన్‌లో క్రీడాకారులను అభినందించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జన విజ్ఞాన వేదిక నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో విజయ సాధించడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో చాంపియన్స్‌గా నిలిచిన క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో చాంపియన్స్‌గా నిలిచిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. అనంతరం క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ మచ్చా ఆదిశేషురెడ్డి, కెప్టెన్ ఓటికుండ సమర సింహారెడ్డి, వైస్ కెప్టెన్ కోట తిరుపతి రెడ్డి, బోగిరెడ్డి కృష్ణరెడ్డి, బోగిరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, శవనం పవన్ కళ్యాణ్ రెడ్డి, నాయుడు బల్లా రెడ్డి, నాయుడు బల్లా సాయిరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, పిట్టు తిరుపతిరెడ్డి, పిట్టు వెంకటేశ్వర రెడ్డి, దుండి బాలారెడ్డి, అసోది వెంకటేశ్వర రెడ్డి, బేతపూడి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాబు షూరిటీ వద్దు

టీడీపీ నాయకులను అడ్డుకున్న నిజాంపట్నం మొగదారమ్మతల్లి కాలనీ వాసులు



టీడీపీ నాయకులను అడ్డగిస్తున్న నిజాంపట్నం మొగదారమ్మ తల్లి కాలనీవాసులు

నిజాంపట్నం: రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించేందుకు వస్తున్న టీడీపీ నాయకులను ఆ గ్రామ ప్రజలు శుక్రవారం అడ్డుకున్నారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో నియోజకవర్గ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ ఆధ్వర్యంలో పర్యటిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను తమ గ్రామంలోకి రావద్దంటూ నిజాంపట్నం మోగదారమ్మ తల్లి కాలనీ ఏరియా గ్రామస్తులు అడ్డుకున్నారు. బాబు షూరిటీ వద్దు భవిష్యత్తు గ్యారెంటీ వద్దు మా గ్రామంలో పర్యటించడానికి వీల్లేదు అంటూ అడ్డగించారు. దీంతో టీడీపీ నాయకులకు గ్రామస్తులకు మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న నిజాంపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శాంతి భద్రతల పరిరక్షణ కోసం గ్రామంలోకి వెళ్లొద్దంటూ టీడీపీ నాయకుల కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. దీంతో టీడీపీ నాయకులు వెనుతిరిగి వెళ్లారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి పాత రత్నా టాకీస్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని టూ టౌన్ పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. అతని వద్ద ఆరు క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు సూర్య నమస్కారాల పోటీలు



తెనాలిటౌన్: బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో క్రీడా భారతి, యోగభారతి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రథ సప్తమి సందర్భంగా విద్యార్థులకు సూర్య నమస్కార పోటీలు నిర్వహించారు. 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోటీల కన్వీనర్ ప్రభల మల్లికార్జున శర్మ, కో-కన్వీనర్ చీదెళ్ల పవన్‌కుమార్, ఆర్ఎస్ఎస్ నాయకులు అంబటి మారుతీరామ్, టి.హనుమత్ ప్రసాద్, లక్ష్మీ నారాయణ, నటరాజ్‌కుమార్, శశాంక్, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

- మత సామరస్యానికి ప్రతీక నాగరాజు పాలెం ఉరుసు మహోత్సవం
- ఎమ్మెల్యే కోన రఘుపతి



నాగరాజుపాలెం దర్గాలో ఎమ్మెల్యే కోన రఘుపతి

నాగరాజుపాలెం(కర్లపాలెం): హజరత్ బాజీ షహేద్ బాబా ఉరుసు మహోత్సవం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. హజరత్ బాజీ షహేద్ బాబా 41వ ఉరుసు మహోత్సవం కులమతాలకతీతంగా మత సామరస్యానికి ప్రతీకగా శుక్రవారం నాగరాజుపాలెంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి ఉరుసు మహోత్సవంలో పాల్గొని ముజావర్ షేక్ పీరా అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉరుసు మహోత్సవంలో భాగంగా గ్రామపెద్దలు గురువారం రాత్రి గ్రామానికి చెందిన షేక్ నాసర్ సాహెబ్ ఇంటి వద్ద నుంచి షేక్ ఫకీర్ సాహెబ్ ఆధ్వర్యంలో షహేద్ బాబా గంధం తీసుకుని మంగళవాయిద్యాలు, మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ శుక్రవారం మధ్యాహ్నానికి దర్గా వద్దకు తీసుకువచ్చారు. బాబా గంధంకు కులమతాలకు అతీతంగా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. నాగరాజు పాలెం గ్రామంలో ప్రతి ఏటా ముస్లింలు, హిందువులు ఐకమత్యంగా కలసి ఉరుసు మహోత్సవం జరుపుకుంటున్నారు. ఈ మహోత్సవానికి జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. దర్గా వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 3వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పార్టీ నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, మందపాటి పరమానందకుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ వర్గీయులు
- విషం చిమ్ముతున్న ఎల్లో మీడియా, పచ్చ పత్రికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

భట్టిప్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన భట్టిప్రోలు మండలం కోనేటిపురం గౌడపాలెంకు చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. శుక్రవారం అమృతలూరు మండలం కూచిపూడి క్యాంప్ కార్యాలయంలో పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో వీరు చేరారు. వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మేలు జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండని ధైర్యంగా అడిగిన సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరొకసారి జగన్‌ను సీఎంని చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎంతో మంచి చేస్తున్న జగన్ ప్రభుత్వంపై ఎల్లో మీడియా, పచ్చ పత్రికలు విషం చిమ్ముతున్నాయని, ఎటువంటి వదంతులు నమ్మవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భట్టిప్రోలు మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), పాలాటి హనుమంతరావు, మల్లోలు నాగబాబు, కేసన కృష్ణయ్య, పడమటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

బావుడా చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు



బవుడా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ మల్లిఖార్జురావు తదితరులు

చెరుకుపల్లి: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్‌లు వేసినా, నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపట్టినా శాఖాపరమైన చర్యలు తప్పవని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బావుడా నిబంధనలపై మండల ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ 300 మీటర్ల లోపు లేఅవుట్ గానీ భవన నిర్మాణం గానీ చేపట్టాలంటే ఆయా పంచాయతీల అనుమతి సరిపోతుందని 300 మీటర్ల పైన లేఅవుట్ గానీ భవన నిర్మాణం గానీ చేపట్టాలంటే బావుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం బావుడా డైరీ, క్యాలెండర్‌ను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బావుడా వైస్ చైర్మన్ భాను ప్రతాప్, డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదిశేషాచలస్వామి వారికి సుదర్శన హోమం



శ్రీదేవి భూదేవి సమేత ఆదిశేషాచలస్వామి వారు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. పంచముఖ ఆలయాలుగా ప్రసిద్ధి గాంచిన ఈ దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత ఆదిశేషాచలస్వామి వారి సన్నిధిలో సుదర్శన హోమం దేవాలయ ధర్మకర్త తాడికొండ శేషగిరిరావు తనయులు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి, తమిరిశ మారుతి, క్రోవి రామకృష్ణల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వార్లకు ఉదయం స్నపన కార్యక్రమం, పుణ్యాహవాచన, విష్వక్సేన ఆరాధన అనంతరం వసంతోత్సవం జరిగింది. స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని దేవాలయంలో గణపతి స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

బాపట్ల సత్తా చాటిన నోరి



బాపట్ల అర్బన్: ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల రూపకల్పన చేసి బాపట్ల సత్తా చాటారు ఇంజనీర్ నోరి గోపాలకృష్ణమూర్తి అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. పటేల్‌నగర్‌లోని నోరి గోపాలకృష్ణమూర్తి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యులు మాట్లాడుతూ బాక్రానంగల్ డ్యామ్, కోయిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ వంటి ప్రాజెక్టులకు ఆయన రూపశిల్పి అన్నారు. 1963లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారని తెలిపారు. బాపట్లలో జన్మించి, బాపట్ల బోర్డు స్కూల్లో విద్యాభ్యాసం చేసి అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారి కీర్తి పతాకాన్ని ఎగురవేశారని కొనియాడారు. ఇంటర్నేషనల్ లార్జ్ డ్యామ్స్ కాంగ్రెస్‌కు ఉపాధ్యక్షుడిగా నోరి పనిచేశారని చెప్పారు. ఇండో బాంగ్లాదేశ్ జాయింట్ రివర్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నో ఇంజనీరింగ్ అద్భుతాలను ఆవిష్కరించి చరితార్థులయ్యారన్నారు. నేటితరం యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ రాంబాబు, పురపాలక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.